ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

బుధవారం 16 అక్టోబరు 2024

25న విద్యుత్ వినియోగదారుల ముఖాముఖి

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలో విద్యుత్ వినియోగదారుల సమస్యలపై ముఖాముఖీ కార్యక్రమాన్ని ఈ నెల 25న నిర్వహిస్తామని సెస్ ఎండీ శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పట్టణంలోని పద్మనాయక కళ్యాణ మం డపంలో ఈనెల 25న ఉదయం 10 గంటల నుంచి ముఖాముఖీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు ఇందులో పాల్గొని సమస్యలను పరిష్కరించుకోవాలని ఎండీ కోరారు.

ఆటే వారికి ఉపాధి బాట

- ఖోఖో, ఉషు పోటీల్లో నైపుణ్యం
- జాతీయస్థాయిలో ప్రతిభ
- ఒకరికి రైల్వేలో, మరొకరికి ప్రైవేటులో కొలువు



సీనియర్ జాతీయ జట్టు క్రీడాకారులతో ఆనంద్

6

అభివృద్ధి పేరిట ఇళ్లను కూలుస్తారా?

- రోడ్ల విస్తరణ సన్నాహాలపై నిర్వాసితుల ఆగ్రహం
- ఆర్డీవోతో వాగ్వాదం



అధికారులతో వాగ్వాదానికి దిగిన ఇళ్ల యజమానులు

8

ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- గీత కార్మికులకు కాటమయ్య రక్షక కవచ కిట్ల పంపిణీ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

8

న్యూస్ బాక్స్

ఉపాధి అవకాశాలకు దరఖాస్తుల ఆహ్వానం: ఎస్పీ

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఉపాధి అవకాశాల కోసం నిరుద్యోగ యువతీ, యువకుల నుంచి పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహజన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి ఆపై చదివిన 18 ఏళ్ల నుంచి 35ఏళ్ల లోపు వయస్సు కలిగిన నిరుద్యోగ యువకులు సర్టిఫికెట్లతో సంబంధిత పోలీస్‌స్టేషన్లలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న యువతీయువకులకు జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యాలతో మూడు నెలల పాటు సీసీటీవీ ఇన్‌స్టాలేషన్, సాఫ్ట్ స్కిల్స్, బేసిక్ కంప్యూటర్‌పై ఉచిత శిక్షణ ఇచ్చి నైపుణ్యం పెంపొందింపజేస్తామన్నారు. శిక్షణ పొందిన యువకులకు హైద్రాబాద్, కరీంనగర్, వరంగల్ వంటి నగరాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఆయన తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇల్లంతకుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో హిందీ బోధించడానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. గంటల ప్రాతిపదికన పనిచేయడానికి ఈ నెల 17లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. హిందీ పండిట్ ట్రైనింగ్‌తో పాటు టెట్ అర్హత కలిగిఉండాలని, 18న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

వరికోతలు షురూ

- అన్నదాతలను వెంటాడుతున్న తుఫాను భయం
- సన్నరకం ధాన్యానికి రూ. 500 బోనస్
- జిల్లాలో 258 కొనుగోలు కేంద్రాలు
- జిల్లాలో వానాకాలం సాగు 1.80 లక్షల ఎకరాలు
- వరి ధాన్యం దిగుబడి అంచనా 4.37 లక్షల మెట్రిక్ టన్నులు
- 34,200 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం



జిల్లాలో వానాకాలం వరి సాగు

మండలం	ఎకరాల్లో
గంభీరావుపేట	18,800
ఇల్లంతకుంట	24,000
ముస్తాబాద్	22,000
సిరిసిల్ల	4,550
తంగళ్లపల్లి	19,010
వీర్నపల్లి	6,800
ఎల్లారెడ్డిపేట	16,950
బోయినపల్లి	13,000
చందుర్తి	15,500
కోనరావుపేట	17,850
రుద్రంగి	5,500
వేములవాడ	5,200
వేములవాడరూరల్	11,150
మొత్తం	1,80,310

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

వానాకాలం సాగు రైతుల ఇంట ఆనందాన్ని నింపుతుందని భావిస్తున్నారు. వానాకాలం ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులు వెంటాడినా అల్పపీడన ప్రభావంతో సమృద్ధిగా కురిసన వర్షాలు కురిసాయి. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ సీజన్ నుంచి సన్నరకం పంటలకు బోనస్ కూడా ఇవ్వబోతుండడంతో రైతు పంట పండినట్లుగానే భావిస్తున్నారు. పౌరసరఫరాల శాఖ ధాన్యం కొనుగోళ్లకు సర్వం సిద్ధం చేసుకోగా విజయదశమి నుంచే రైతులు వరి కోతల్లో వేగం పెంచారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వానాకాలం సీజన్‌కు సంబంధించిన వరికోతలు, హార్వేస్టర్ల ద్వారా కొనసాగిస్తున్నారు. జిల్లాలో హార్వేస్టర్‌కు సంబంధించి సాధారణ హార్వేస్టర్ గంటకు రెండు వేల రూపాయల నుంచి 2,300 రూపాయలు, చైన్‌మిషన్‌కు సంబంధిచి మూడు వేల రూపాయల నుంచి 3,300 రూపాయల వరకు ఛార్జీ వసూలు చేస్తున్నారు. ధాన్యాన్ని తరలించే ట్రాక్టర్‌కు 500 రూపాయల నుంచి 800 రూపాయల వరకు దూరాన్ని బట్టి కిరాయి వసూలు చేస్తున్నారు. జిల్లాలోని సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, ఇల్లంతకుంట, గంభీరావుపేట, ముస్తా బాద్, కోనరావుపేట, చందుర్తి, వేములవాడ ప్రాంతాల్లో వరికోతలు జోరుగా సాగుతున్నాయి.

● 4.37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అంచనా...

రాజన్న సిరిసిల్ల జిల్లాలో వానాకాలం సీజన్‌లో 2.32 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ప్రధానంగా వరి 1.80 లక్షల ఎకరాల్లో వేశారు. దీని ద్వారా 4.37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాలు వేశారు. ఇందులో స్థానికంగా 60 వేల మెట్రిక్ టన్నులు వినియోగించుకోగా, మిగతా 3.77 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం మార్కెట్‌లోకి రానుంది. ఇందులో మిల్లర్లు 77,885 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నారు. మిగతా మూడు లక్షలమెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ ద్వారా కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఈనెలలో 25 వేల మెట్రిక్ టన్నులు, నవంబరులో 75 వేలు, డిసెంబరులో 1.50లక్షల మెట్రిక్ టన్నులు, 2025 జనవరిలో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనాలు వేసి ఏర్పాట్లు చేశారు.

● సన్నరకం 34,230 మెట్రిక్ టన్నుల ధాన్యం

ప్రభుత్వం మద్దతు ధర గ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు 2,320 రూపాయలు, కామన్ రకానికి 2,300 రూపాయలు నిర్ణయించారు. దీనికి తోడుగా సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం అదనంగా 500 రూపాయలు బోనస్ ఇవ్వనుంది. జిల్లాలో సన్నరకం సాగు 13,300 ఎకరాల్లో చేశారు. దీని ద్వారా 34,230 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాలు వేశారు. దీని ద్వారా రైతులకు రూ 17.11 కోట్లు అదనపు లబ్ధి చేకూరనుంది. సన్నరకం ధాన్యం కొనుగోళ్లలో స్థానికంగా 4,230 మెట్రిక్ టన్నుల ధాన్యం వినియోగించుకోగా మార్కెట్‌లోకి 30,000 మెట్రిక్ టన్నులు వస్తుందని అంచనాలు వేశారు. ఇందులో మిల్లర్లు 5,400 మెట్రిక్ టన్నులు, కొనుగోలు చేస్తే మిగతా 24,600 మెట్రిక్ టన్నులు పౌరసరఫరాల కార్పొరేషన్ కొనుగోలు చేయనున్నట్లు అంచనాలు వేశారు.

కొనుగోళ్లకు సర్వం సిద్ధం

8లో..

సీఎంఆర్ గడువు పొడిగింపు

- ఈనెల 31లోగా లేవీని పూర్తి చేయాలి
- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



మిల్లర్లతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వానాకాలం, యాసంగి 2023-24 సంబంధించిన సీఎంఆర్ గడువు ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించామని, గడువులోగా మిల్లర్లందరూ ఎఫ్‌సీఐకు ఇవ్వాల్సిన బియ్యం తొందరగా అందజేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ కోరారు. కలెక్టరేట్‌లో జిల్లాలోని రా మరియు బాయిల్డ్ రైస్‌మిల్లర్లతో సీఎంఆర్ బియ్యం సరఫరాపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2023-24 సీజన్‌లకు సంబంధించి 74 రా రైస్‌మిల్లులు, 29 బాయిల్డ్ రైస్‌మిల్లులకు సంబంధించి 2 లక్షల 715 టన్నుల ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు ఇచ్చారన్నారు. దీనికి సంబంధించి 1,35,023 టన్నుల బియ్యం ప్రభుత్వానికి అందజేశారని తెలిపారు. ఇంకా 34,045 టన్నుల బియ్యం మిల్లర్ల వద్ద నుంచి ప్రభుత్వానికి రావాల్సి ఉందన్నారు. వానాకాలం, యాసంగికి సం బంధించి 24 రా రైస్ మిల్లులు, 35 బాయిల్డ్ రైస్‌మిల్లులకు 2,56,126 టన్నుల ధాన్యం అందించారన్నారు. మిల్లుల నుంచి 1,74,165 టన్నుల బియ్యం రావాల్సి ఉండగా 75,111 టన్నుల బియ్యం అందజేశారని 99,757 టన్నుల బియ్యం రావాల్సి ఉందన్నారు. సీఎంఆర్ ఇవ్వడానికి ప్రభుత్వం గడువు పొడగించిందని మిల్లరు గడువులోగా బియ్యం అందించాలని లేని పక్షంలో డీఫాల్ట్ అయిన మిల్లర్ల దగ్గర నుంచి 25 శాతం పెనాల్టీతో వసూలు చేస్తామని హెచ్చరించారు. 2024-25 సీజన్‌కు చెందిన వానాకాలం వరి కోతలు ప్రారంభం అయ్యాయని ఇందుకు సంబంధించి కొనుగోలు కేంద్రాలు రెండు మూడు రోజుల్లో ప్రారంభం అవుతాయని తెలిపారు. మిల్లర్లు ధాన్యం దిగుమతి చేసుకుని రైతులకు, ప్రభు త్వానికి సహకరించాలని కోరారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వసంతలక్ష్మి, అదనపు అధికారి బి నందిని, జిల్లా మేనేజర్ రజిత, మిల్లర్ల సంఘం అధ్యక్షుడు చేపూరి నాగరాజు, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

132 మంది ఉపాధ్యాయులకు పోస్టింగ్



కౌన్సెలింగ్‌కు హాజరైన నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు

సిరిసిల్ల అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డీఎస్సీ ద్వారా ఎంపికైన 132 మంది నూతన ఉపాధ్యాయులకు ఖాళీగా ఉన్న పోస్టులకు ఆప్షన్స్ ద్వారా కేటాయిస్తున్నామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన పోస్టింగ్ కౌన్సెలింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా ఎంపికైన స్కూల్ అసిస్టెంట్‌లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు, వ్యాయామ ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి అక్టోబరు 9న నియామక పత్రాలు అందజేశారన్నారు. జిల్లాలో ఎంపికైన 132 మంది నూతన ఉపాధ్యాయులు 16న పాఠశాలల్లో జాయిన్ కావాల్సిందిగా సూచించారు. సమావేశంలో డీఈవో రమేష్ తదితరులు ఉన్నారు.

గురుకుల కళాశాల భవనానికి తాళం

వేములవాడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలో గురుకుల పాఠశాల, కళాశాలకు అద్దెకు ఇచ్చిన భవనం కిరాయిని ప్రభుత్వం చెల్లించడంలో జాప్యాన్ని నిరసిస్తూ భవన యజమాని మంగళవారం తాళం వేసి నిరసన తెలిపాడు. వేములవాడ పట్టణంలోని భవానినగర్‌లో బోయినపల్లి మండల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల అద్దె భవనంలో కొనసాగుతోంది. దీనికి సంబంధించి ఎనిమిది నెలలుగా కిరాయి చెల్లించడంలో జాప్యం చేస్తున్నారంటూ యజమాని రాకేష్ మంగళవారం తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి వెంటనే అక్కడకు చేరుకొని అద్దె బకాయి విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి బకాయి చెల్లించే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. దీంతో యజమాని రాకేష్ తాళం తీయడంతో యథావిధిగా కళాశాల కొనసాగింది.



గేటుకు తాళం వేసి నిరసన వ్యక్తం చేస్తున్న యజమాని

కాటన్ వస్త్ర పరిశ్రమలకు ఆర్డర్లను ఇప్పించండి

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందించే చీరలను కాటన్ మిక్స్‌తో తయారు చేయించడం కోసం సిరిసిల్లలోని కాటన్ వస్త్ర పరిశ్రమలకు ఆర్డర్లను ఇప్పించాలని కాటన్ వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్య వేదిక జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కాటన్ వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్య వేదిక జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు కలిసి సమస్యలను విన్నవించాలని వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఐక్య వేదిక జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత ప్రభుత్వం మహిళలకు బతుకమ్మ పండుగ సందర్భంగ అందించిన బతుకమ్మ చీరలను కాటన్‌తో కాకుండా పాలిస్టర్‌తో తయారు చేయించిందన్నారు. దీంతో సిరిసిల్లలో కాటన్ వస్త్ర పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులకు చీరలను అందించాలనే నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇచ్చే చీరల్లో కాటన్ ఉపయోగించి తయారు చేయడం వలన కుంటుపడుతున్న కాటన్ వస్త్ర పరిశ్రమలకు జీవం పోసినట్లు అవుతుందన్నారు. సమావేశంలో సైజింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌడ సురేష్, యారన్ అసోషియేషన్ అధ్యక్షుడు పిస్కమధు, వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, డైయింగ్ అసోషియేషన్ అధ్యక్షుడు కోడం అనంద్‌బాబు, కాటన్ వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు కట్టెకోల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ విప్‌తో కాటన్ వస్త్రపరిశ్రమ ఐక్యవేదిక నాయకులు

కథల పోటీల్లో ఆవునూర్ విద్యార్థినుల ప్రతిభ

ముస్తాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మాచిరాజు బాలసాహిత్య పీఠం నిర్వహించిన కథల పోటీల్లో మండలంలోని ఆవునూర్ విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. ఆవునూర్ ఉన్నత పాఠశాలకు చెందిన తోట పూజ (10వతరగతి) రాసిన మా ఊరి అందాలు కథ, జక్కుల శ్రావణి(8వతరగతి) రాసిన స్నేహానికి ప్రతిరూపం కథ ఉత్తమ కథలుగా ఎంపికయ్యాయని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మద్దికుంట లక్ష్మణ్ తెలిపారు. కథల పోటీలకు ఉమ్మడి రాష్ట్రం నుంచి 232 కథలు రాగా అందులో 28 కథలను ఉత్తమ కథలుగా ఎంపిక చేసినట్లు మాచిరాజు బాలసాహిత్య పీఠం నిర్వాహకులు మాచిరాజు కామేశ్వర్‌రావు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన పూజ, శ్రావణిలకు వచ్చే నెల 3వతేదీన హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో సన్మానంతో పాటు నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశాంసాపత్రంతో పాటు బాలసాహిత్యానికి సంబంధించిన పుస్తకాలు అందజేస్తారన్నారు. విద్యార్థులను ప్రముఖ కవి గరిపెల్లి అశోక్, హెచ్ఎం మద్దికుంట లక్ష్మణ్, ఉపాధ్యాయులు అభినందించారు.



తోట పూజ



జక్కుల శ్రావణి

స్థానిక అవసరాలకు ఇసుకను అనుమతించాలి

తంగళ్లపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పనులకు, స్థానిక అవసరాలకు ఇసుక అనుమతించాలని మండల కాంగ్రెస్ నాయకులు తహసీల్దార్ జయంత్ కుమార్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ పనులు గృహ నిర్మాణాలు ఇసుక లేక నిలిచిపోయాయని దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. అధికారులు ఇసుక అనుమతి ఇవ్వాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జలగం ప్రవీణ్, మాజీ ఎంపీటీసీ బైరనేని రాము, నాయకులు పెద్దూరి తిరుపతి, పొన్నాల పరశురాములు, ఆసాని లక్ష్మారెడ్డి కోరారు.

పెరటికోళ్ల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

ఇల్లంతకుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పెరటికోళ్ళ పెంపకంతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని అడిషినల్ డీఆర్డీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని సోమారంపేట గ్రామంలో మంగళవారం రాజన్న మదర్ యూనిట్‌లో ఆరువారాల పెరటికోళ్లను ఆసక్తి కలిగిన సభ్యులకు అమ్మకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు బ్రాయిలర్, నాటుకోళ్ల కంటే పెరటికోళ్లలో అధిక పోషక విలువలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డీపీఎం సుధారాణి, ఎంపీడీఓ శశికళ, ఏపీఎం వాణిశ్రీ, సీసీలు రామచంద్రారెడ్డి, వెంకటేశం, రాజేశ్వరి, నిర్వాహకురాలు కవిత తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు

తంగళ్లపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం మండపల్లి కేసీఆర్ నగర్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అనుమానిత ప్రాంతాలతోపాటు, షాపుల్లో డాగ్ స్క్వాడ్‌తో మత్తు పదార్థాల కోసం తనిఖీలు చేశారు. ఎస్ఐ చంద్రమౌళి ఆధ్వర్యంలో క్లోజ్ టైం కానిస్టేబుల్ ప్రశాంత్ గౌడ్, నార్కోటిక్ డాగ్ కానిస్టేబుల్ సురేష్‌లు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల నిర్వాహకులు

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 15 (అంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదుల చేయాలంటూ శాతవాహన యునివర్సిటీ డీగ్రీ, పీజీ మేనెజ్‌మెంట్ అసోషియేషన్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మంగళవారం ప్రైవేటు డీగ్రీకళాశాల నిర్వహకులు అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడుసంవత్సరాల నుంచి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడంతో కళాశాలను నిర్వహించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. భవనాల అద్దెలు, అధ్యాపకుల వేతనాలు, నిర్వహణ ఖర్చుల కోసం చేసిన అప్పులు వడ్డీలతో కలిసి తడిసి మోపడయ్యాయన్నారు. పండుగ పూట అధ్యాపకుల వేతనాలు కూడా ఇవ్వలేకపోయామన్నారు. ప్రభుత్వంలో ఉన్న మంత్రులతోపాటు అన్ని నియోజకవర్గాల శాసనసభ్యులకు వినతి పత్రాలను ఇచ్చామన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కొలనూరు శేఖర్‌రెడ్డి, గుగ్గిళ్ల జగన్‌గౌడ్, గెంట్యాల భూమేష్, బాల్‌రెడ్డి, రాజేష్, అధ్యాపకులు అజీమ్‌పాషా, దామోర స్వామి, లక్ష్మణ్, చిటికెన వేణుగోపాల్, కిరణ్, వేణుమారన్, చక్రపాణి, మధు, కిరణ్ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

గంభీరావుపేట, అక్టోబరు 15: మండలంలోని లింగన్నపేట హరిహర దేవాలయంలో మంగళవారం రాత్రి వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య సాగిన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి, స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని, కట్నకానుకలు సమర్పించారు. కార్యక్రమంలో భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మహిళా సంఘాల సభ్యులను ఇబ్బందులకు గురిచేయవద్దు

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 15 (అంధ్రజ్యోతి): మహిళా సంఘాల సభ్యులను బ్యాంక్ అధికారులు వేధింపులకు గురిచేయవద్దని రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీకి చెందిన మహిళా సంఘాలకు చెందిన సభ్యులు జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం మధుకర్‌తో విప్‌ను కలిశారు. గ్రామంలో సీఏ పనిచేస్తున్న కళ్యాణి లనే మహిల 22 మహిళా సంఘాలకు చెందిన రూ 15 లక్షల 77వేల 500లతో పారిపోయిందని వివరించారు. అయితే డబ్బులను కళ్యాణి తీసుకెళ్లడంతో బ్యాంక్ అధికారులు తమను డబ్బు చెల్లించాలంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. బ్యాంక్ అధికారుల వేధింపుల నుంచి కాపాడాలంటూ వేడుకున్నారు. స్పందించిన ఆది శ్రీనివాస్ వెంటనే సంబంధిత బ్యాంక్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పారిపోయిన సీఏ కళ్యాణి ఆచూకీ దొరికే వరకు మహిళా సంఘాల సభ్యులను ఇబ్బందులకు గురి చేయవద్దంటూ ఆదేశించారు. కూచన రేఖ, తుమ్మ పద్మ, జక్కని మాధవి, ఎనగందుల కల్పన, గాజెంగి లక్ష్మీ, మేర్గు వరలక్ష్మీ, వీరబత్తిని అంబిక, మామిడాల వరలక్ష్మీ, ద్యావనపెల్లి ఉమ ఉన్నారు.

క్రైం కార్నర్

కొండగట్టులో జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

● ఉత్తర్వులు జారీ చేసిన ఈవో

● 'అన్నదానం' సరుకులు చోరీ ఘటనలో చర్యలు

మల్యాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో నిర్వహిస్తున్న నిత్యాన్నపథకంలో వినియోగించే సరుకులు చోరీకి గురైనట్లు వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపిన ఈవో రామకృష్ణరావు అన్నదానం ఇన్‌చార్జి, జూనియర్ అసిస్టెంట్ కె.రాములుపై సస్పెన్షన్ వేటు వేశారు. నిత్యాన్నదానం పథకంలో భాగంగా అన్నదానానికి వినియోగించే 50కిలోల బియ్యంతో పాటు పలు ఇతర సరుకులను ఈ నెల 9న వంటగ్యాస్ సరఫరా చేసే ఆటోలో తరలించినట్లు పలు వురు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆదివారం అన్నదానం ఇన్‌చార్జి రాములుకు మెమో జారీ చేసి 24గంటల్లోపు సంజాయిషీ ఇవ్వాలని పేర్కొన్నారు. సీసీ కెమెరాలలోనూ సరుకుల తరలింపు రికార్డు అయినట్లు అధికారుల పరిశీలనలో తేలడం, ఆటో డ్రైవర్ సురేశ్ వాగ్మూలం మేరకు మంగళవారం రాములను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ఈవో పేర్కొన్నారు. గతంలోనూ అతను విధులు నిర్వహించిన చోట కూడా రాములు అన్నదానం సరుకులు మా యం చేసినట్లు స్థానికంగా చర్చించుకుంటున్నారు. ఇటీవల సాధారణ బదిలీలలో భాగంగా వేములవాడ రాజరాజేశ్వర దేవస్థానం నుంచి కొండగట్టుకు బదిలీపై వచ్చారు. రాగానే గతంలో తాను అక్కడ నిర్వహించిన అన్నదానం విభాగం కోసం పైరవీలు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అందులో భాగంగానే మొదట ఆ విభాగం కేటాయించిన ఉద్యోగిని విధుల్లో చేరక ముందే ఆయనను మార్చి రాములుకు అన్నదానం విభాగానికి అప్పగించారనే విమర్శలు ఉన్నాయి. కాగా రాములు స్థానంలో మరో జూనియర్ అసిస్టెంట్ ధర్మేంధర్‌కు అన్నదాన సత్రం నిర్వహణ బాధ్యతలు అప్పగించారు.

తండ్రిని హత్య చేసిన తనయుడికి జీవిత ఖైదు

జగిత్యాల క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : భూమి అమ్మకం విషయం లో తల్లిని రాయితో గాయ పరిచి తండ్రిని కర్రతో కొట్టి హత్య చేసిన కేసులో కుమారుడికి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ. 5,000 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం గొల్లపెల్లి మండలం రాపల్లి గ్రామానికి చెందిన గడుగు పోచయ్య తన చిన్న కుమారుడు ప్రభుదాస్‌కు మధ్య భూతాగాలు ఉన్నాయి. పోచయ్య తన పేరిట ఉన్న రెండు ఎకరాల భూమి అమ్మకం విషయంలో పగ పెంచుకున్న కుమారుడు ప్రభుదాస్ తన తల్లి శాంతను రాయితో కొట్టి గాయపరిచి తండ్రి పోచయ్యను కర్రతో తలపై కొట్టి హత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యులు గొల్లపల్లి పోలీసులకు 23 నవంబరు 2008న ఫిర్యాదు చేయగా అప్పటి డీసీఆర్‌బీ డీఎస్పీ మహేష్ బా బు, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డి కేసు నమోదు చేశారు. ప్రస్తుత పో లీసులతో పాటు సీఎంఎస్ ఎస్సై రాజు నాయక్, కోర్టు డ్యూటీ అధికారులు కిరణ్ కుమార్, శ్రీధర్ సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టారు. అదనపు పీపీ మల్లిఖార్జున్ కేసు వాదించగా నేరం రుజువు కావడంతో ముద్దాయి ప్రభుదాస్‌కు జీవిత ఖైదు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య

వేములవాడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజన్న ఆలయం ఎదుట గల ప్రధాన వీధిలో ఉన్న కొబ్బరికాయలు, బెల్లం దుకాణాల్లో తాత్కాలిక కూలీగా పనిచేసే మైత్రి నవీన్ (19) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 27 సంవత్సరాల వయసున్న ఓ వివాహేత పట్ల నవీన్ ఆకర్షితుడయ్యాడు. తాను ఆమెను ప్రేమిస్తున్నానంటూ తరచూ మాట్లాడేందుకు ప్రయత్నించేవాడు. ఈ క్రమంలో సదరు మహిళ బతుకమ్మ పండుగ కోసం ఊరికి వెళ్లగా తనను చూడాలని ఉందంటూ ఫోన్ చేశాడు. ఫోన్ మాట్లాడడానికి ఆమె నిరాకరించడంతో పాటు ఇకముందు తన వద్దకు రావద్దని తనతో మాట్లాడేందుకు ప్రయత్నించవద్దని తేల్చి చెప్పినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో నవీన్ తన చేతిని కోసుకుంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. అనంతరం కనిపించకుండా పోయిన ఆ యువకుడు మంగళవారం నాడు వేములవాడ గుడి చెరువులో శవమై తేలాడు. మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు సదరు మృత దేహం నవీన్‌దిగా గుర్తించారు. గుడి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఇదిలా ఉండగా నెల రోజుల క్రితం కూడా నవీన్ పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం చేసుకోగా కరీంనగర్‌లోని ఆసుపత్రిలో చికిత్స అందించడంతో కోలుకున్నాడు. నెలరోజుల వ్యవధిలోనే రెండోసారి ఆత్మహత్యయత్నం చేసి బలవన్మరణానికి పాల్పడడం చర్చనీయాం శంగా మారింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టామని వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు.



అందమైన అల్లిక..

జగిత్యాల అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల రోడ్డు.. పక్కన ఉన్న ఓ చెట్టు వద్ద అందమైన బుట్టలు అల్లుతూ దంపతులు కనిపిస్తారు. వెదురుతో తయారు చేస్తున్న ఆ బుట్టలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. మహిళలు గుడికి వెళ్లేటప్పుడు తీసుకెళ్లే సామగ్రిని ఈ బుట్టలో పెట్టుకుని వెళ్లవచ్చు. నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం రామా పురం గ్రామానికి చెందిన దేవరకొండ ప్రభాకర్ దంపతులు జగిత్యాల పట్టణంలోని మెడికల్ కళాశాల సమీపంలో రోడ్డు పక్కన ఓ చెట్టు కింద వెదురు బుట్టలు తయారు చేస్తున్నారు. బుట్ట అల్లిక పూర్తయ్యాక వాటికి కలర్ వైరును చుట్టడంతో మరింత ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. చాలా మంది వీటిని కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో బుట్టను 150 రూపాయలకు అమ్ముతున్నారు. దంపతులిద్దరూ రోజుకు ఎనిమిది బుట్టల వరకు అల్లుతున్నారు. ఇవే బుట్టలు బయట దుకాణాల్లో రెం డు వందల రూపాయలకు పైగా అమ్ముతారని, తామే తయారు చేస్తు న్నాం కాబట్టి 150 రూపాయలకే ఇస్తున్నామని ప్రభాకర్ తెలిపాడు.



బుట్ట అల్లుతున్న ప్రభాకర్

ఆటే వారికి ఉపాధి బాట

● ఖోఖో, ఉషు పోటీల్లో నైపుణ్యం

● జాతీయస్థాయిలో ప్రతిభ

● ఒకరికి రైల్వేలో, మరొకరికి ప్రైవేటులో కొలువు

● కోచ్‌లుగా ప్రత్యేక గుర్తింపు

ఇల్లంతకుంట/గంభీరావుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆటలపై ఉన్న ఆసక్తి వారి ఉపాధికి బాటలు వేసింది. జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచి ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో కొలువులు సాధించారు. ఉద్యోగాలు చేస్తూనే క్రీడల్లో ప్రతిభ చాటుతున్నారు. ఇల్లంతకుంట మండల కేంద్రానికి చెందిన ఆనంద్, గంభీ రావుపేటకు చెందిన రాణా విక్రమ్ గాంధీ తాము ఎంచుకున్న రంగంలో ఆత్మవిశ్వాసంతో రాణిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండల కేంద్రానికి చెందిన పండుగు కనుకవ్వ, నర్సయ్య దంపతుల మూడో కుమారుడు ఆనంద్‌కు ఆటలంటే ఇష్టం. ఏడోతరగతి వరకు వాణీనికేతన్ హైస్కూల్ చదివిన ఆనంద్ అనంతరం జిల్లాపరిషత్ పాఠశాలలో చేరాడు. జిల్లాపరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న అప్పటి వ్యాయామ ఉపాధ్యాయుడు మహేందర్‌రావు పిల్లలకు ఆటలాడిస్తుండగా ఆనంద్‌లోని ప్రతిభను గుర్తించి మెలుకవలు నేర్పించాడు. దీంతో కాకినాడలోని స్పోర్ట్స్ అకాడమీలో సీటు సాధించిన ఆనంద్ పదోతరగతి, ఇంటర్మీడియెట్ పూర్తి చేశాడు. కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్‌లో డిగ్రీ రెండో సంవత్సరం పూర్తి చేస్తుండగానే పలు పోటీలలో సత్తాచాటాడు. ఉమ్మడి జిల్లా నుంచి ఖోఖోలో ప్రతిభ కనబరిచాడు. 2008లో స్పోర్ట్స్ కోటాలో రైల్వేలో ఉద్యోగం సాధించాడు. స్పోర్ట్స్ కోటాలో 18 సంవత్సరాల వయస్సులో ఉద్యోగం పొందాడు.



సీనియర్ జాతీయ జట్టుకు కోచ్‌గా క్రీడాకారులతో ఆనంద్

ఉత్తమ ప్రదర్శన

ఖోఖోలో ఆనంద్ అనేక సందర్భాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచాడు. సబ్ జూనియర్స్ నేషనల్స్ గ్రామీణ క్రీడల్లో రాష్ట్ర జట్టుకు నాయకత్వం వహించి సిల్వర్ మెడల్ సాధించాడు. నాలుగు సార్లు జూనియర్ నేషనల్స్, యూనివర్సిటీ నేషనల్స్, నేషనల్ గేమ్స్‌తోపాటు ఇన్విటేషన్స్ టోర్నీలో 12సార్లు పాల్గొన్నాడు.

భారత ఖోఖో జట్టుకు నాయకత్వం

నాందేడ్‌లోని సౌత్‌సెంట్రల్ రైల్వేలో ఉద్యోగం చేస్తూ సీనియర్ జాతీయస్థాయిలో వరుసగా ఏడు గోల్డ్‌మెడల్స్, ఒక సిల్వర్ మెడల్ సాధించాడు. 2016లో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన 3వ ఏషియన్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఈ పోటీల్లో భారత్, మలేషియా, సింగపూర్, కొరియా, పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ జట్లు పాల్గొన్నాయి. సెమీఫైనల్స్‌లో శ్రీలంకపై, ఫైనల్స్‌లో బంగ్లాదేశ్‌పై 5 పాయింట్లు సాధించి గోల్డ్‌మెడల్ సాధించడంలో ఆనంద్ క్రియాశీలకంగా వ్యవహరించాడు. నాటి లోకసభ స్పీకర్ సుమిత్రా మహాజన్ చేతుల మీదుగా భారతజట్టు ట్రోఫీ అందుకుంది.

తెలంగాణ జట్టుకు ఖోఖో కోచ్‌గా

నాందేడ్ నుంచి హైదరాబాద్‌కు బదిలీ అయిన ఆనంద్ తెలంగాణ సీనియర్ జట్టుకు ప్రస్తుతం ఖోఖో కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. ఖోఖో క్రీడకు మరింత ప్రాధాన్యం పెంచే క్రమంలో 2018లో తీసుకొచ్చిన అల్టిమేట్ ఖోఖోలో చెన్నై క్విక్‌గన్స్‌టీంకు ప్రాతినిధ్యం వహిస్తూ రాణిస్తున్నాడు.



మాజీ లోకసభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌ను నుంచి ట్రోఫీ కప్ అందుకుంటున్న ఆనంద్

ఖోఖో క్రీడాకారులకు అవకాశాలు



పండుగు ఆనంద్‌కుమార్, జాతీయ ఖోఖో క్రీడాకారుడు ఇల్లంతకుంట

గతంలో ఖోఖో క్రీడకు అంతగా ప్రాధాన్యం లభించేది కాదు. స్పోర్ట్స్ కోటాలో కేవలం రైల్వేలోనే ఉద్యోగాలు లభించేవి. నేడు పరిస్థితి మారింది. అల్టిమేట్ ఖోఖో రావడంతో అనేక మంది ఖోఖో పట్ల ఆసక్తిని పెంచుకుంటున్నారు. పట్టుదల, సరైన దిశానిర్దేశం ఉంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటాం. భారత జట్టుకు నాయకత్వం వహించడం జీవితంలో మరిచిపోలేనిది. తల్లిదండ్రులు, వ్యాయామ ఉపాధ్యాయుడు మహేందర్‌రావు ప్రోత్సాహంతోనే ఉన్నతస్థాయికి చేరుకున్నాను.

జాతీయ స్థాయి ఉష్ పోటీల్లో గంభీరావుపేట యువకుడు



ఉషు పోటీల్లో శిక్షణ తీసుకుంటున్న రాణా విక్రమ్‌గాంధీ

పట్టుదల ఉంటే రాణించవచ్చని, ఆటలను ఉపాధికి బాటలుగా మల్చుకోవచ్చని నిరూపించాడు గంభీరావుపేటకు చెందిన క్రీడాకారుడు రాణా విక్రమ్ గాంధీ. వ్యవసాయ కుటుంబ నుంచి వచ్చిన విక్రమ్‌గాంధీ చిన్నతనంలో మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందాడు. కుంగ్ ఫూ, జూడో, ఫెన్సింగ్, బాక్సింగ్ వంటి క్రీడల్లో రాణించి పలువురి చేత బేష్ అనిపించుకున్నాడు. పద్దెనిమిదేళ్ల వయస్సు నుంచి ఉషు క్రీడపై మక్కువ పెంచుకున్నాడు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధించాడు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోచ్, జిల్లా ఉషు సంఘం కార్యదర్శి బారా విద్యాసాగర్ వద్ద శిక్షణ తీసుకున్నాడు. ఉషులో మెలకువలను నేర్చుకుని ఉమ్మడి రాష్ట్రంలో కరీంనగర్ తరఫున మూడు రాష్ట్ర, మూడు జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించాడు.

ప్రస్తుతం జాతీయస్థాయి ఉషు క్రీడకు కోచ్‌గా వ్యవహరిస్తూ న్యాయ నిర్ణేతగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. 2018లో ఉత్తమ కోచ్ అవార్డును అందుకున్నాడు. ప్రస్తుతం 33 ఏళ్ల వయ స్సు ఉన్న రాణా విక్రమ్‌గాంధీ చొప్పదండిలోని ప్రైవేటు పాఠశాలలో పీఈటీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. 2011 మార్చిలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణం, 2012 మార్చిలో హరిద్వార్‌లో జాతీయ స్థాయిలో రజతం, 2011 అక్టోబర్‌లో హైదరాబాద్ రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణం, 2011 డిసెంబరులో పాండిచ్చేరిలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో కాంస్యం, 2012 ఫిబ్రవరిలో కరీంనగర్‌లో రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణం, 2012 మార్చిలో జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో రజత పథకాలు సాధించాడు. అనేకసార్లు రాష్ట్ర ఉషు జట్టుకు ప్రాతినిధ్యం వహించి మన్ననలు పొందాడు.

జాతీయ రహదారి పనుల్లో నాణ్యత లోపం

ప్రారంభం కాక ముందే సైడ్ వాల్స్‌కు పగుళ్లు



ఇరుకుల్ల, దుర్శేడ్ గ్రామం మీదుగా రహదారి నిర్మాణం



బ్రిడ్జి సైడ్ వాల్‌కు పగుళ్ళు



నిర్మాణంలోవచ్చిన పగుళ్ళు

కరీంనగర్ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే 563 రహదారి పనుల్లో నాణ్యత లోపాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. ప్రారంభం కాక ముందే పగుళ్ళు ఏర్పడుతున్నాయి. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామ శివారు లోని మానేరు బ్రిడ్జి సమీపంలో రహదారి పనుల్లో భాగంగా సైడ్ వాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇరుకుల్ల, దుర్శేడ్ గ్రామం మీదుగా బొమ్మకల్ శివారు నుంచి మానకొండూర్ ప్రధాన రహదారికి అనుసంధానంగా ఈ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మానేరు వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనుల్లో నాణ్యత లేకుండా ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారని గ్రామస్థులు అంటున్నారు. సైడ్‌వాల్స్‌కు అప్పుడే పగుళ్లు వచ్చాయి. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కరీంనగర్‌కు రిమోట్ ఆపరేటెడ్ లైవ్‌బోయ్ బోట్

మానేరు జలాశయంలో 70 మంది ఫైర్ సిబ్బందికి శిక్షణ



రిమోట్ ఆపరేటెడ్ లైవ్‌బోయ్ బోటు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జలాశయాలు, వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా రక్షించేందుకు కరీంనగర్‌కు ప్రభుత్వం నూతన రిమోట్ ఆపరేటెడ్ లైవ్‌బోయ్ బోటును అందించింది. ఈ రిమోట్ బోయ్ బోట్ ఖరీదు సుమారు 5 లక్షల వరకు ఉంటుంది. వరదనీటిలో, జలాశయాల్లో ప్రమాదంలో ఉన్న వారిని రక్షించేందుకు ఈ లైవ్‌బోయ్ బోటును రిమోట్‌తో ఆపరేట్ చేసి నీటిలో ఆపదలో ఉన్న వ్యక్తి వద్దకు పంపించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చుతారు. ఈ లైవ్‌బోయ్ బోట్‌తో 800 మీటర్ల దూరంలో ఉన్న వ్యక్తిని కూడా రిమోట్ ఆపరేషన్ ద్వారా రక్షించేందుకు అవకాశం ఉంది. ఈ లైవ్‌బోట్ ఆపరేట్ చేసే విధానం, ఆపదలో ఉన్న వ్యక్తులను రక్షించే విధానం, నిర్వహణ తదితర అంశాలపై కరీంనగర్ శివారులోని మానేరు జలాశయంలో కరీంనగర్ డివిజన్ అగ్రిమాపకశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో 70 మంది ఫైర్ సిబ్బందికి మంగళవారం శిక్షణ ఇచ్చారు. కాళేశ్వరం, బాసర, రాజన్న సిరిసిల్ల మూడు జోన్‌లకు సంబంధించిన ఏడు జిల్లాలలోని అగ్నిమాపక సిబ్బంది ఈ శిక్షణలో పాల్గొన్నారు. రెండు రోజులపాటు ఈ శిక్షణ జరుగనుంది. రాష్ట్ర స్థాయి ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్ ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో లైవ్‌బోయ్ బోట్‌ను అందించిన శ్రీలత కంపెనీ ప్రతినిధులు మనోజ్ సావంత్, ఉమేష్ ఫైర్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కరీంనగర్ అగ్నిమాపకశాఖ డివిజన్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి 20 లైవ్‌బోయ్ బోట్లు మంజూరు కాగా అందులో ఒకటి కరీంనగర్‌కు ఇటీవల వచ్చిందని తెలిపారు. ఈ అధునాతన రిమోట్ ఆపరేటివ్ బోటు నిర్వహణపై ఫైర్ సిబ్బందికి శిక్షణను ఇస్తున్నామని అన్నారు. ఆపదలో ఉన్నవారిని సురక్షితంగా రక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, మెలకువలను ఈ శిక్షణలో నేర్పించినట్లు తెలిపారు. ఇప్పటికే విక్టిమ్ లొకేషన్ కెమెరా అందుబాటులో ఉందన్నారు. వరదల సందర్భంలో పాత ఇళ్లు కూలిన సమయంలో శిథిలాల కింద 10 మీటర్ల లోతులో చిక్కుకున్న వారిని గుర్తించేందుకు ఈ కెమెరాను వినియోగిస్తామన్నారు. ఈ కెమెరాతో శిథాలాల కిందకు చిన్న రంధ్రం ద్వారా కెమెరా కేబుల్‌ను పంపించి పరిశీలించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కెమెరా విలువ దాదాపు 12 లక్షల వరకు ఉంటుందన్నారు.



మానేరు జలాశయంలో శిక్షణ పొందుతున్న ఫైర్ సిబ్బంది

కోరుట్లలో యువకుడి దారుణ హత్య

● పాత కక్షలే కారణం



బోయిన సాగర్ ఫైల్

కోరుట్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రకాశం రోడ్డులో సోమవారం అర్ధ రాత్రి యువకుడు దారుణ హత్యకు గురా య్యాడు. ఆదే ప్రాంతంలో ఉండే యువకులు తరచుగా గొడవలకు పాల్పడేవారు. అవే కక్ష లు హత్యకు దారితీసినట్లుగా తెలుస్తోంది. తోటి స్నేహితుడితో వచ్చిన విబేధాల్లో సయో ధ్య కుదుర్చుకునేందుకు ఒక్క ప్రాంతానికి చేరుకున్న యువకుల మధ్య గొడవ చోటు చేసుకుంది. ఆ గొడవ కాస్త పెద్దదిగా మారి హత్యకు దారితీసినట్లుగా తెలుస్తోంది. పూర్తి వివరాల ప్రకారం పట్టణంలోని ప్రకాశం రోడ్డుకు చెందిన బోయిని సాగర్ అలియాస్ కళ్యాణ్, మంచోడు (32) అదే కాలనీకి చెందిన యువకులతో పాతకక్షలు ఉన్నాయి. సోమవారం సాగర్‌తో తన స్నేహితులతో కలిసి మద్యం తాగుతుండగా కొందరు యువకులు అక్కడి చేరుకుని గొడవ పడ్డారు. వెంటనే గమనించిన చుట్టు పక్కల వారు 100 నంబర్‌కు సమాచారం అందించారు. బ్లూకోట్స్ కానిస్టేబుల్ అక్కడికి వెళ్లి యువకులను సముదాయించి అక్కడి నుంచి వెళ్లగొట్టాడు. ఈ క్రమంలో రాత్రి 12 గంటల ప్రాంతంలో మరోమారు యువకులు గొడవ దిగారు. ఈ క్రమంలో నలుగురు యువకులతో పాటు మరి కొంత మంది సాగర్‌పై దాడికి పాల్పడ్డట్లు తెలుస్తోంది. అందులోంచి ఓ యువకుడు కత్తితో సాగర్ మె డపై దాడికి చేయడంతో తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం దాడికి పాల్పడ్డ వారు అక్కడి నుంచి పారిపోయారు. విషయం తెలుసుకున్న సీఐ సురేష్ బాబు, కోరుట్ల, కథలాపూర్ ఎస్ఐలు శ్రీకాంత్ నవీన్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సాగర్ తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. గత సంవత్సరం క్రితం జరిగిన బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు ప్రవీణ్ సింగ్ హత్య కేసులో సాగర్ నిందితుడు.

చొప్పదండి సహకార సంఘం సందర్శన



చొప్పదండి సహకర సంఘాన్ని సందర్శించిన అధికారుల బృందం

చొప్పదండి, అక్టోబరు15: చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని పశ్చిమ బెంగాల్, ఉత్తర్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ డిసిసిబి బ్యాంకు అధికారుల బృందాలు మంగళవారం సందర్శించింది. క్షేత్ర సందర్శనలో భాగంగా ఈ బృందాలు సందర్శించి సంఘం పనితీరును పరిశీలించారు. రైతులకు అందిస్తున్న పంట రుణాలు, ఎరువుల విక్రయాల గురుంచి అడిగి తెలుసుకున్నారు. సంఘం లాభాల బాటలో పయనించడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో లక్నో బర్డ్ డీజీఎం రజనీ పాండే, నాబార్డ్ డీడీఎం జయప్రకాశ్, కేడీసీసీ డిజిఎం బ్రహ్మానందరావు, పీడీసీ రిసోర్స్ పర్సన్ సత్యనారాయణ సంఘం చైర్మన్ వెల్మ మల్లరెడ్డి, సీఈఓ తిరుపతి రెడ్డి డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయన వ్యవసాయ క్షేత్రాన్నే ప్రయోగశాలగా మార్చుకున్నాడు.. దేశంలోని పలు ప్రాంతాలకు వెళ్లి వివిధ రకాల సాగు పద్ధతులను అధ్యయనం చేశాడు. ఇక్కడి భూములకు అనువుగా ఉండే విధానాన్ని రూపొందించుకుని కూరగాయల సాగును ప్రారంభించాడు. ఇందుకు ప్రభుత్వ ఉద్యోగాన్నీ వదులుకున్నాడు. రాజీనామా పత్రంలోనూ కూరగాయల సాగు చేసేందుకు ఉద్యోగాన్ని వదిలిపెడుతున్నానని రాశాడంటే ఆయన ఎంత ఆత్మవిశ్వాసంతో అటువైపు అడుగులు వేశాడో అర్థం చేసుకోవచ్చు. అందరూ విచిత్రంగా చూసినా.. తను అనుకున్నది సాధించి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు తిమ్మాపూర్ మండల కేంద్రానికి చెందిన మాదన కొమురెల్లి. 'ఆంధ్రజ్యోతి'కి ఆయన అనుభవాలను వివరించారు.. - తిమ్మాపూర్, ఆంధ్రజ్యోతి

- నూతన పద్ధతుల్లో సేంద్రియ వ్యవసాయం
- ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి కూరగాయల సాగులోకి..
- తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధిస్తున్న కొమురెల్లి

వ్యవసాయ క్షేత్రమే ప్రయోగశాలగా..

అనుభవం


డ్రిప్ విధానంలో పండిస్తున్న కొతిమీర

నేను సాధారణ కుటుంబంలో జన్మించాను.. చిన్న వయసులోనే వివాహమైంది. ఇంటర్ వరకు చదివాను. అనంతరం టైప్, కంప్యూటర్ కోర్సు చేశాను. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తుండగా కానిస్టేబుల్ నోటిఫికేషన్ వచ్చింది. అప్లై చేసుకుని ఉద్యోగం సాధించాను. 1995 నుంచి 1997 వరకు ఉద్యోగం చేశాను. అప్పుడు జీతాలు తక్కువగా ఉండేవి. ఇద్దరు పిల్లలు, భార్యను ఆ జీతంతో పోషించలేక ఇబ్బంది పడ్డాను. ఉద్యోగం చేసినా నా మనస్సు వ్యవసాయం వైపే లాగేది.



కూరగాయల సాగు చేయాలని, మన కాళ్లపై మనం నిలబడాలని అనుకునేవాడిని. రెండు సంవత్సరాలు ఉద్యోగం చేసిన తర్వాత ఇక ఆ పనిలో కొనసాగలేనని అనిపించింది. వెంటనే రాజీనామా చేశాను. కూర గాయల సాగు చేసుకునేందుకే రాజీనామా చేస్తున్నానని లేఖలో రాశాను.. అందురూ నవ్వారు. సన్నిహితులు నచ్చజెప్పారు. అయినా వినలేదు. నా లక్ష్యం అదే అనుకుని ముందడుగు వేశాను. రాజీనామా చేసిన తర్వాత మా స్వగ్రామమైన తిమ్మాపూర్‌కు చేరుకున్నాను. మాకున్న మూడెకరాల భూమిలో వ్యవసాయం ప్రారంభించాను.



వినూత్న పద్ధతుల్లో..

మా ప్రాంతంలో ఎక్కువగా వరి సాగు చేస్తారు. అందరికన్నా భిన్నంగా ఉండాలని నేను కూరగాయల సాగును ఎంచుకున్నాను. ఇందుకు చాలా కష్టపడ్డాను. దేశంలో వివిధ ప్రాంతాల్లో అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేశాను. ఎక్కడ కొత్త విధానంలో వ్యవసాయం చేస్తున్నారని తెలిసినా అక్కడికి వెళ్లాను. అన్నింటిని పరిశీలించి మన ప్రాంతానికి అనువైన పద్ధతిని రూపొందించుకున్నాను. సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయాలని నిర్ణయించుకున్నాను. నాకున్న భూమిలో అంతా ఒక్క పంట వేయకుండా వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు పండిచడం ప్రారంభించాను. మొదట్లో కొంత కష్టమైనా ఇష్టంగా పని చేశాను. తర్వాత అలవాటైంది. మొదటి రెండు సంవత్సరాలు చిన్నచిన్న ఇబ్బందులు ఎదురైనా ధైర్యంతో వాటన్నింటిని అధిగమించాను. కూరగాయల సాగుతో అధిక లాభాలు సాధించవచ్చు. ప్రణాళికా ప్రకారం సాగు చేస్తే నెలవారీగా ఆదాయం పొందవచ్చు.

ఎనిమిది మందికి ఉపాధి

ఒకప్పుడు కుటుంబసభ్యులం కష్టపడే వారం. రానురాను పంటలు పెరిగేసరికి ఇతరుల సహాయం తీసుకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం మాతో పాటు ఎనిమిది మంది పని చేస్తున్నారు. నా భార్య అరుణ అన్ని పనుల్లో నాకు చేదోడు.. వాదోడుగా ఉంటుంది. నాకు ఇద్దరు కుమార్తెలు. పెద్దమ్మాయికి వివాహం జరిగింది. చిన్నమ్మాయి బెంగళూర్‌లో ఉద్యోగం చేస్తోంది. నేను పండించే పంటను మార్కెట్‌లో విక్రయిస్తా.

వ్యవసాయం చేయాలంటే ఓపిక అవసరం


పంటను మార్కెట్‌కు తరలిస్తున్న రైతు కొమురెల్లి

వ్యవసాయం చేయాలంటే ఓపిక అవసరం. కూరగాయల సాగుతో మంచి లాభాలు ఆర్జించవచ్చు. కొత్తగా వ్యవసాయంలోకి వచ్చే రైతులు అవగాహన వచ్చే వరకు ఎక్కువ పెట్టుబడులు పెట్టొద్దు. తక్కువ విస్తీర్ణంలో తక్కువ పెట్టుబడి పెట్టి వ్యవసాయం ప్రారంభించాలి. అవగాహన వచ్చిన తర్వాత విస్తీర్ణాన్ని పెంచుకోవాలి. అప్పులు తెచ్చి పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టి ఇబ్బందులు పడొద్దు. చాలా మంది రైతులు సేంద్రియ పద్ధతులు అంటే పెట్టుబడి ఎక్కువ పెట్టి పండిన పంటలను ఎక్కువ ధరకు విక్రయిస్తారు. నేను సాధ్యమైనంత తక్కువ పెట్టుబడి తో సాగు చేస్తాను. వినియోగదారులకు తక్కువ ధరకే అమ్ముతాను.

శాశ్వత పందిరి

కూరగాయల సాగులో ఎప్పటికప్పుడు సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటించాల్సి ఉంటుంది. నూతన పద్ధతులను గమనించాల్సి ఉంటుంది. నేను పెండల్స్, జేఐ వైర్ సహాయంతో నాలుగు లక్షల నుంచి ఐదు లక్షల వరకు పెట్టుబడి పెట్టి శాశ్వతంగా ఉండేలా పందిరి వేశాను. అంతకు ముందే ఎరువులు వేసుకుని మళ్లు ఎత్తుగా తయారు చేసుకున్నాను. మల్చింగ్ విధానంలో విత్తనాలు వేశాను. బిందు, తుంపర్ల విధానంలో మొక్కలకు నీటిని అందిస్తున్నాను. ఇది మంచి ఫలితాన్ని ఇస్తోంది. మంచి దిగుబడి వస్తోంది. ప్రస్తుతం టమాట, బీర, మిర్చి, కాకర పంటలు పండిస్తున్నాను. కొత్తిమీర, ఇతర ఆకు కూరలు సాగు చేస్తున్నాను. వాతావరణ, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా పంటలను మార్చుతుంటాను. సంవత్సరానికి ఒకపంట తీసే టమాట, మిర్చికి మూడు లక్షల నుంచి నాలుగు లక్షల వరకు ఆదాయం వస్తుంది. బీర, కాకర సంవత్సరానికి రెండుసార్లు పండుతాయి. ఒక్కో పంటకు రెండు లక్షల నుంచి మూడు లక్షల రూపాయల వరకు ఆదాయం వస్తుంది. పెట్టుబడులు పోను ఏడాదికి 15 లక్షల రూపాయల వరకు సంపాదిస్తున్నాను. ప్రస్తుతం ఎకరం విస్తీర్ణంలో మిరప, ఎకరం టమాట, రెండు ఎకరాల్లో పందిరి కూరగాయలైన బీర, కాకరకాయలు, 20 గుంటల్లో కొత్తిమీర సాగు చేస్తున్నాను. వీటితోపాటు అంతరపంటలు సాగు చేస్తున్నాను. పందిరిపై ఉన్న పంట తీసివేసే సమయానికి ఎదిగేలా అంతర పంటలు వేస్తున్నా. అవి చేతికొచ్చే సమయానికి పందిరి కూరగాయాలు విత్తుకుంటాను. ఈ విధానం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చు.


తీగజాతి సాగు కోసం వేసిన శాశ్వత పందిరి


మల్చింగ్ విధానంలో సాగు చేస్తున్న టమాట


కొమురెల్లి సాగు చేసిన కాకర కాయ పంట

క్రీడా సమాచారం

18న ఉమ్మడి జిల్లా అండర్-23 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా అండర్-23 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను ఈనెల 18న నిర్వహించనున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ కళాశాల ఎదురుగా గల కేడీసీఏ కార్యాలయ ఆవరణలో ఈ ఎంపిక పోటీలను నిర్వహించనున్నామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి ఆగంరావు, ఎన్ మురళీధర్‌రావు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే 60 మంది క్రీడాకారులను మొదటి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేసి అందులోంచి 15 మంది క్రీడాకారుల చొప్పున నాలుగు జట్లను ఎంపిక చేయనున్నారు. ఈ జట్లుకు పోటీలు నిర్వహించిన ఆ మ్యాచ్‌లో విశేష ప్రతిభచాటే క్రీడాకారు లను ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక చేయనున్నామని వారు తెలిపారు. ఎంపికైన ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు నవంబర్‌లో మెదక్, వరంగల్ జిల్లాల్లో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహించే అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. 1-9-2001 తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. అర్హత గల క్రీడాకారులు రెండు ఫొటోలు, జనన ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో ఉదయం 9 గంటలకు జిల్లా క్రికెట్ సంఘం ఉపాధ్యక్షులు కె మహేందర్‌గౌడ్, పి మనోహర్‌రావులకు రిపోర్టు చేయాలని సూచించారు.

20న ఉమ్మడి జిల్లా జూనియర్ ఖో-ఖో జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న ఉమ్మడి జిల్లా జూనియర్ ఖో-ఖో జట్ల ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఈ పోటీలను ఉదయం 9 గంటల నుంచి బాల బాలికల విభాగంలో నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా ఖో-ఖో అసోసియేషన్ కార్యదర్శి వై మహేందర్‌రావు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను రాష్ట్రస్థాయి జూనియర్ ఖో-ఖో పోటీలకు ఎంపిక చేయనున్నామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 22-11-2006 తర్వాత జన్మించినవారై ఉండాలని పేర్కొన్నారు. క్రీడాకారులు ఎస్సెస్సీ మెమో, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 9గంటలకు రిపోర్టు చేయాలని ఆయన సూచించారు.

రూ.6,900 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,900 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 30మంది రైతులు 172క్వింటాళ్ల విడి పత్తి, ఐదుగురు రైతులు పది క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.6,900, కనిష్ఠ ధర రూ.6,100 పలికింది.

అండాళమ్మకు ఒడిబియ్యం

- లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా బ్రహ్మోత్సవాలు


పట్టువస్త్రాలతో మున్సిపల్ చైర్‌పర్సన్, పద్మశాలి సంఘం ప్రతినిధులు

సిరిసిల్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం అండాలమ్మ వారికి మహిళలు పెద్దసంఖ్యలో తరలి వచ్చి ఒడిబియ్యం సమర్పించుకున్నారు. సిరిసిల్ల పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళలు తరలివచ్చి ఒడిబియ్యం సమర్పించుకున్నారు. అనంతరం లక్ష్మీవేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా పద్మావతిదేవి అమ్మవారికి ఒడిబియ్యం, పట్టు వస్త్రాలను సిరిసిల్ల పద్మశాలీ సంఘం ప్రతినిధులు సమర్పించారు. మార్కండేయ స్వామి దేవాలయం నుంచి ఒడిబియ్యంతో వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు పూర్ణచందర్, గుజ్జె తార, కాముని వనిత, అడెపు రవీందర్ పాల్గొన్నారు.

బర్నింగ్ ఇష్యూ

ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల నిరవధిక బంద్

- మూడేళ్ల ఫీజు బకాయిలు చెల్లించాలని యాజమాన్యాల డిమాండ్
- ఉద్యమానికి సిద్ధమవుతున్న విద్యార్థి సంఘాలు

గణేశ్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తమకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీల యాజమాన్యాలు కళాశాలల నిరవధిక బంద్ నిర్వహిస్తున్నాయి. ఈ నెల 14 నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 60 డిగ్రీ కళాశాలలు, 35 పీజీ కళాశాలలు నిరవధిక బంద్ పాటిస్తున్నాయి. రెండు రోజులు గడిచినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రకపోవడంతో విద్యార్థులు, లెక్చరర్స్, విద్యార్థి సంఘాల నేతలు ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. ఉమ్మడి జిల్లా జిల్లా వాప్తంగా 120 కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయి.



జగిత్యాలలో మూసివేసిన డిగ్రీ కళాశాల

● కష్టంగా మారిన నిర్వహణ

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పైనే ఆధారపడిన యాజమాన్యాలు ప్రైవేట్ కళాశాలలు నడుపుతున్నాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఖర్చులన్నీ యాజమాన్యాలు భరించాల్సి వస్తోంది. మూడేళ్లుగా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో యాజమాన్యాలకు సిబ్బంది జీతాల చెల్లింపు, కాలేజీల నిర్వాహణ భారంగా మారింది. నెలల తరబడి వేతనాలు అందక ఆయా కళాశాలల్లో పని చేస్తున్న అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో దీక్షలు నిర్వహించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో కాలేజీల యాజమాన్యాలు నిరవధిక బంద్ నిర్వహిస్తున్నాయి.

● విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

చిక్కుల కిరణ్, విద్యార్థి సంఘు నాయకుడు



ఫీజు బకాయిల కోసం ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు బంద్ వాల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అకడమిక్ వాతావరణం దెబ్బతినే అవకాశం ఉంది. సెమిస్టర్ పరీక్షలకు ఇబ్బంది కలుగుతుంది. ఫీజు బకాయిల విషయంలో ప్రభుత్వం వేంటనే స్పందించాలి. లేకపోతే ఉద్యమాలు నిర్వహిస్తాం.

● ప్రభుత్వం స్పందించాలి

వెంకటేశ్వర్రావు, డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు



తప్పని పరిస్థితుల్లో నిరవధిక బంద్‌కు వెళ్లాల్సి వచ్చింది. మా ఉద్దేశ్యం విద్యార్థులను ఇబ్బంది పెట్టాలన్నది కాదు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ఇస్తేనే కళాశాలలు మనుగడ సాగించగలు గుతాయి. విదార్థులు, కళాశాలలో పనిచేస్తున్న సిబ్బంది, కుటుంబాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం స్పందించాలి.

● విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు



రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ డిగ్రీ ,పీజీ కళాశాలల యాజమాన్యాలపై ఆర్థిక భారం పడుతోంది. కళాశాలల బంద్‌తో సెమిస్టర్ పరీక్షలు ఆలస్యయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వం వెంటనే డిగ్రీ కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరిపి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి.

కల.. సాకారమవుతున్న వేళ..!

- వంతెన నిర్మాణంతో రామారావుపల్లె, ఇటిక్యాల గ్రామస్థుల హర్షం


పూర్తయిన వంతెన

రాయికల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని రామారావుపల్లె-ఇటిక్యాల పెద్ద వాగుపై వంతెన పనులు తుది దశకు చేరాయి. రామారావుపల్లె గ్రామంలో సుమారు 120 కుటుంబాలు 530 జనాభా ఉంది. గ్రామస్థులు తమ అవసరాలకు నిత్యం రాయికల్ మండలానికి లేదా పక్కనున్న ఇటిక్యాల గ్రామానికి వెళ్లాలంటే మధ్యలో గోదావరి పెద్ద వాగు ఉండటంతో చుట్టూ సుమారు 10 కి.మీ. దూరం తిరిగి వెళ్తున్నారు. దశాబ్దాల నాటి నుంచి ఈ వాగుపై వంతెన నిర్మాణానికి ప్రతిపాదించినా నిధులు మంజూరు కాక ప్రజలు అవస్థలు పడ్డారు. ఎట్టకేలకు రెండేళ్ల క్రితం వంతెన, ఇరువైపులా రహదారి నిర్మాణానికి రూ.9 కోట్లు మంజూరు కాగా పనులు ప్రారంభమయ్యాయి. బిల్లులు రాక పనులు మధ్యలో ఆగిపోగా, జనవరిలో మళ్లీ ప్రారంభించారు. పెద్ద వాగుపై 280 మీటర్ల మేర 16 పిల్లర్లపై స్లాబులు పూర్తయ్యాయి. మరో మూడు మాసాల్లో వంతెన అందుబాటులోకి రానుండటంపై ఇరు గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అనంతగిరి నుంచి చిత్రపురికి

అసిస్టెంట్ కెమెరామన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా రాణింపు



సినిమా చిత్రీకరణలో బాలకిషన్

ఇల్లంతకుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టుదలతో లక్ష్యసాధనకు కృషి చేస్తే సాధ్యం కానిదేమీ లేదని నిరూపిస్తున్నాడు ఇల్లంతకుంట మండలం అనంతగిరి కుర్రాడు. కళాకారుడిగా ఎదిగి స్థిరపడాలనే ఆశయంతో నిరంతరం శ్రమించాడు. లక్ష్యాన్ని చేరుకునే ప్రయత్నంగా ముందుకు సాగుతున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరికి చెందిన తిప్పరవేని మల్లమ్మ, రాజయ్య దంపతుల కుమారుడు బాలకిషన్‌కు చిన్నతనం నుంచి నాటకరంగంపై ఆసక్తి. మండలంలోని పలు గ్రామాల్లో నాటకాలు వేసినప్పుడు చిన్నచిన్న పాత్రలు పోషించే వాడు. దానికి తోడు ప్రకృతిని తన కెమెరాలో బంధించడం అలవాటుగా మార్చుకున్నాడు. సినీ రంగంలో అవకాశాలు వెతుక్కుంటూ 15 ఏళ్ల క్రితం హైదరాబాద్‌కు వెళ్లాడు. అనేక ప్రయత్నాల అనంతరం 2005లో నటుడు శ్రీకాంత్ హీరోగా నటించిన 'శ్రీకృష్ణదేవరాయ' సినిమాకు తొలిసారిగా అసిస్టెంట్ కెమెరామెన్‌గా పని చేశాడు. అనంతరం బాస్, స్టూడెంట్ నంబర్ 1, ఇంద్రాక్ష, తొలిపరిచయం, వారిధి వంటి సినిమాలకు పనిచేసి మంచి గుర్తింపు పొందాడు. ప్రభాస్ నటించిన 'మిర్చి' సినిమా వీడియో మేకింగ్ చేశాడు. 2016లో అన్నపూర్ణ బ్యానర్‌పై నిర్మించిన టీవీ సీరియల్ 'శశిరేఖ పరిణయం'కు అసిస్టెంట్ కెమెరామెన్‌గా పనిచేశాడు. 'పసిడి మొగ్గలు, జోగిని, వేడుక'లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా రాణించాడు.

2014లో హరితహారంపై బాలకిషన్ తీసిన డాక్యుమెంటరీకి తెలంగాణ ప్రభుత్వం నుంచి మొదటి బహుమతి లభించింది. ఇటీవల కాలంలో యూట్యూబ్‌లో పలు పాటలు, సామాజి క అభివృద్ధి అడ్డంకిగా మారిన అం శాలపై దృష్టి కేంద్రీకరించాడు. స్థానిక కళాకారులతో షార్ట్‌ఫిలిమ్స్ తీస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు. అనంతగిరి గ్రామంలోని ముత్యాల పోచమ్మపై తీసిన పాట ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇలా సినిమాలు, యూ ట్యూబ్ చానల్ లో బాలకిషన్ తనదైన శైలిలో రాణిస్తున్నాడు.


సినిమా షూటింగ్‌లో బాలకిషన్

సినిమారంగంలో రాణిస్తా

బాలకిషన్ తిప్పరవేణి, నటుడు, కెమెరామెన్, ఇల్లంతకుంట

సినిమారంగంలో ఇప్పటికే పలు చిత్రాలకు అసిస్టెంట్ కెమెరామెన్‌గా పనిచేశాను. టీవీ సీరియల్స్‌లో ఆర్టిస్టుగా పనిచేశాను. సినిమారంగంలో రాణించడమే లక్ష్యం. అనేక ఇబ్బందులు ఎదుర్కొని ముందుకు సాగుతున్నా. స్థానిక కళాకారులతో యూట్యూబ్‌లో పాటలు, షార్ట్‌ఫిలిమ్స్‌తో మంచి గుర్తింపు లభిస్తోంది. అనంతగిరి గ్రామస్థులు, తల్లి దండ్రుల సహకారం మరువలేనిది.

న్యూస్ బాక్స్

మంత్రి పొన్నంను కలిసిన కాంగ్రెస్ నాయకులు

గంభీరావుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను మంగళవారం మండల కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు గుర్రం రాజుగౌడ్ కలిసారు. మండలంలోని కొత్తపల్లి రోడ్డు సరిగ్గా లేక బస్సులు నడవడం లేదని, ఫలితంగా ఇతర పట్టణాలకు చదువు కోసం వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి పొన్నంకు రాజు విన్నవించారు. ఎల్లమ్మ ఆలయం నుంచి శిలాజీనగర్ గ్రామ సరిహద్దు వరకు డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ పనులను మొదలయ్యే విధంగా చూడాలని మంత్రిని కోరారు. కామారెడ్డి నుంచి కొత్తపల్లి మీదుగా దుబ్బాక వరకు బస్సులు నడిచే విధంగా కామారెడ్డి డీపో ఆర్‌ఎంతో మాట్లాడాలని మంత్రికి వివరించారు. మంత్రి పొన్నం ప్రబాకర్ స్పందించి, రోడ్డు సమస్యతో పాటు బస్సులు నడిచే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి పొన్నం ప్రబాకర్‌ను కలిసిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దమ్మ శ్రీనివాస్, శంకరయ్య తదితరులు ఉన్నారు.

డీఈవోను కలిసిన కాంగ్రెస్ నాయకులు

గంభీరావుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో డీఈవోను గంభీరావుపేట మండల కాంగ్రెస్ నాయకులు మంళవారం కలిసారు. మండలంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను నూతనంగా డీఎస్సీ ద్వార నియమింపబడ్డ అభ్యర్థుల చేత పూర్తి చేయాలని విద్యాధికారికి విన్నవించారు. మండల పరిధిలో చాలా వరకు ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. డీఈవోను కలిసిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిది పర్శ హన్మండ్లు తదితరులు ఉన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం ఆరెపల్లి గ్రామంలోని భక్తాంజనేయ స్వామి వారి దేవాలయంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం మొదటి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం 6.30 గంటలకు హనుమాన్ ఆలయ ఆవరణలో భక్తులు మంగళహారతులతో హాజరయ్యారు. ప్రతి మంగళవారం ఆలయంలో హనుమాన్ పారాయాణం చేపట్టడమే కాకుండా మొదటి వార్సికోత్సవాన్ని పురష్కరించుకుని 21 మార్లు హనుమాన్ పారాయాణాన్ని చేపట్టారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హిందూ ఉత్సవ సమితి నిర్వహకుడు మోటూరి మధుసూదన్ హజరయ్యారు.

ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ


వేములవాడలో రక్షణ కిట్‌లను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్, కలెక్టర్

సిరిసిల్ల/వేములవాడ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం పాటించిన ఆర్థిక విధానాల వల్ల రాష్ట్రం ఆర్థికంగా కష్టాల్లో ఉన్నప్పటికి ప్రజాసంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో, వేములవాడ మండల పరిషత్ ఆవరణలో గీత కార్మికులకు కాటమయ్య రక్షక కవచ కిట్‌ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టే సమాయానికి ఆర్థికంగా రాష్ట్రం చాలా దెబ్బతిందని ప్రతీ నెల వచ్చే రూ 18 వేల కోట్ల ఆదాయంలో ఆరు వేల కోట్లు అప్పుల వడ్డీలకే ఖర్చు అవుతుందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం అంశంలో వెనకాడడం లేదన్నారు. ఆర్థిక లీకేజీలను ఆడంబరాలను అరికడుతూ ప్రజా సంక్షేమం కోసం ఖర్చు చేస్తున్నామని అన్నారు. గీత కార్మికులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల్లో పెద్దఎత్తున ఈత చెట్లను పెంచే అంశాలను పరిశీస్తామన్నారు. కాలువకు ఇరువైపులా ఈత చెట్లు నాటేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతామని తెలిపారు. సిరిసిల్ల నియోజకవర్గంలో 200 మంది గీత కార్మికులకు కిట్ల పంపిణీ చేస్తున్నామని అన్నారు. గీత కార్మికులు ఈత చెట్లు, తాటి చెట్లు ఎక్కి ప్రమాదాల వల్ల వైకల్యం పొందడం, ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందని దీనిని నివారించేందుకు సాంకేతికంగా కిట్లను తయారు చేసి కాటమయ్య రక్షణ కిట్ పేరుతో పంపిణీ చేస్తున్నామని అన్నారు.

కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ సిరిసిల్ల నియోజకవర్గంలో 200 మంది లబ్ధిదారులను ఎంపికచేసి రక్షణ కిట్‌లను అందిస్తున్నామన్నారు. కిట్లను ఉపయోగించడానికి గీత కార్మికులకు శిక్షణ అందించామని అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం గీత కార్మికులకు సేఫ్టీ పరికరాలను అందించడం చాలా సంతోషకరమని కార్మికులు వీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ స్వరూపరాణి, బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజమనోహర్, ఎక్సైజ్ శాఖ అధికారి పంచాక్షరి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

ముస్తాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మండల కార్యదర్శి మిద్దె నర్సన్న అధ్యక్షతన మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. కొనుగోలు కేంద్రాలను తక్షణం ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ఇప్పటికే మండలంలో దాదాపు 25 శాతం ధాన్యం రైతులు దళారులకు అముకున్నారని దీంతో క్వింటాలుకు 550 నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం వల్లనే నష్టం జరుగుతుందని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సోమ నాగరాజు, మిద్దె నర్సన్న , బూదన్న, మల్లేశ్, నీరెడ్డి నర్సింహులు, గీస దేవయ్య, బాలరాజు, రాజేందర, శంకర్, ముత్తయ్య ,రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు తోడ్పడాలి


సమావేశంలో మాట్లాడుతున్న టౌన్ సీఐ కృష్ణ

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రహదారులపై ధాన్యం ఒకేవైపు ఆరబెట్టి రోడ్డు ప్రమాదాల నివారణకు తోడ్పడాలని సిరిసిల్ల టౌన్ సీఐ కె కృష్ణ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సిరిసిల్ల బైపాస్ రహదారుల పక్కన గల పెద్దూరు, చిన్నబోనాల, పెద్దబోనాల, ముష్టిపల్లి, రాజీవ్‌నగర్, చంద్రంపేట, రగుడు గ్రామాల కౌన్సిలర్లు, వివిధ రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే వైపు ధాన్యం ఆరబెట్టి రైతులు సహకరించాలన్నారు. నిబంధనలు ఎవరైనా అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ట్రాఫిక్ ఎస్‌ఐ రమేశ్, కౌన్సిలర్లు పాతూరి రాజిరెడ్డి, లింగంపల్లి సత్యనారాయణ, బోల్లం నాగరాజు, పెద్దూర్ సింగిల్‌విండో చైర్మన్ జీల కిషన్‌యాదవ్, డైరెక్టర్ సలేంద్రీ బాలరాజుయాదవ్ నాయకులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని రహదారులపై ఆరబోస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రమాకాంత్ హెచ్చరించారు. ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని మైదానాలు, ఖాళీ స్థలాల్లో ఆరబెట్టుకోవాలని ఎస్‌ఐ సూచించారు.

బోన్ క్యాన్సర్ బాలుడికి ఆర్థిక సాయం

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న బాలుడికి రూ లక్షా 42 వేల చెక్కును సిరిసిల్ల కలెక్టరేట్‌లో బాలుడి తండ్రి కోడం హరికిషన్‌కు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం అందించారు. సిరిసిల్ల పట్టణంలోని గణేష్‌నగర్‌కు చెందిన కోడం హరికషన్ కుమారుడు బోన్ క్యాన్సర్‌తో ఇబ్బంది పడుతున్నాడని, తన కుమారునికి వైద్య ఖర్చులు అందించాలని సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్మల స్వరూపతిరుపతిరెడి ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆది శ్రీనివాస్ కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో మాట్లాడి రూ లక్ష 42 వేల చెక్కును కలెక్టర్ కోటా నుంచి రాయించి బాధితుడికి అందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్మల స్వరూపతిరుపతిరెడ్డి, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఉన్నారు.

గాలికుంటు టీకా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

వేములవాడ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గాలికుంటు వ్యాధి నివారణ టీకా శిబిరాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. లింగంపల్లి గ్రామంలో గాలికుంటు వ్యాధి టీకాలు వేసే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. ప్రతీ రైతు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తమ పాడి, పశువులకు వేయించాలన్నారు. గాలికుంటు వ్యాధి సోకకుండా ప్రతీ రైతు తమ పశువులకు ముందస్తుగా టీకాలు ఇప్పించాలన్నారు. పశు వైద్యాధికారులు, రైతులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

చందుర్తి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం రామన్నపేట గ్రామానికి చెందిన చెన్నవేని మౌనికకు రూ 29500 చెక్కును మండల బీఆర్‌ఎస్ అధ్యక్షులు మ్యాకల ఎల్లయ్య మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజి సర్పంచ్ దుమ్మ అంజయ్య, మ్యాకల పర్శరాములు నాయకులు మరాఠి మల్లిక్, పొతరాజు నాగేష్, భైరగొని రమేష్, గుడిసె రమేష్, తిప్పని అజయ్, దుద్యాల లచ్చిరెడ్డి, పోతరాజు తిరుపతి, ఎరెడ్డి రాజిరెడ్డి తిప్పని రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినలింగాపూర్ గ్రామంలో లబ్ధిదారులకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భైరనేని రాము, ప్యాక్స్ డైరెక్టర్ మంద నారాయణ గౌడ్, కాంగ్రెస్ నాయకులు, గుర్రం రవీందర్‌రెడ్డి, శ్రీరాముల వెంకటేష్, రేగుల ఎల్లయ్య, బోలవేణి అనిల్, మరిపల్లి మల్లికార్జున్, గుర్రం రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం కార్యవర్గం ఎన్నిక

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని సంఘం సభ్యులు మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా స్వామిగౌడ్, ఉపాధ్యక్షుడిగా కిష్టాస్వామిగౌడ్, కోశాధికారిగా సాయిలుగౌడ్‌లు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా పూర్ణచందర్‌గౌడ్, ప్రభాకర్‌గౌడ్, ఎల్లయ్య గౌడ్‌లను ఎన్నుకున్నారు. సంఘ సభ్యుల సమస్యల పరిష్కారానికి పాటు పడుతామని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు పర్శరాములుగౌడ్, రమేశ్‌గౌడ్, ప్రభుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మిడ్ మానేరులో దూకి వివాహిత ఆత్మహత్య

వేములవాడ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ రాసినా ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపం చెందిన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన వేములవాడ మండలం అరెపల్లి గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్‌కు చెందిన నక్క దివ్య (33) వివాహితకు గతంలో రెండు వివాహాలు జరుగగా విడాకులు అయ్యాయని తెలిపారు. అలాగే ఇటీవల డీఎస్సీ పరీక్ష రాసినా ఉద్యోగం రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై మంగళవారం రోజున వేములవాడ మండల ఆరేపెల్లి గ్రామ శివారులోని మిడ్ మానరులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసినట్లు సీఐ వీరప్రసాద్ తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడు..

బోయినపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య బారినపడిన ఓ వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోయినపల్లి మండలం రామన్నపేట గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన నల్లగొండ శంకరయ్య గౌడ్ (65) గత పది సంవత్సరాలుగా కుష్టు వ్యాధితో ఇబ్బంది పడుతున్నాడు. దీంతో వృద్ధుడు శంకరయ్య మనోవేదనకు గురై ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపూర్ బస్టాండు ప్రాంతంలోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధానరహదారిపై మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మండలంలోని బండలింగంపల్లి గ్రామానికి చెందిన కొత్తపత్తి బాబు, కొత్తపల్లి వెంకటేశ్‌లు తీవ్ర గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో బాబు పరిస్థితి విషమంగా మారింది. బండలింగంపల్లి గ్రామంలోని బాబు, వెంకటేశ్‌లు కలిసి తమ ద్విచక్రవాహనంపై సిరిసిల్లకు వెళ్లి తిరిగి ఎల్లారెడ్డిపేట వైపుకు వస్తున్నారు. ఇటు నుంచి సిరిసిల్ల వైపుకు వెళుతున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

నామాపూర్ శివారులో చోరీ

ముస్తాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నామాపూర్ శివారులోని ఓ హోటల్‌లో చోరి జరిగింది. ముస్తాబాద్ నుంచి నామాపూర్ వెళ్లేదారిలో గల గూడెం చౌరస్తాలో లచ్చన్నగారి లింగం హోటల్ నడిపిస్తూ జీవనం వెళ్లదీస్తున్నాడు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హోటల్‌లో చొరబడి తాళాలు పగుల గొట్టి దాదాపు రెండు వేల నగదు, తినుబండారాలు, మద్యం సీసాలను దొంగిలించినట్లు హోటల్ యజమాని తెలిపారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

ఇద్దరిపై అదనపు వరకట్నం కేసు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పుట్టింటి నుంచి అదనంగా వరకట్నం తీసుకురావాలని కట్టుకున్న భార్యను వేధించిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన భర్త మొగుళ్ల శ్రీనివాస్‌తో పాటు అత్త లింగవ్వలపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ మంగళవారం రాత్రి తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామంలోని లలితకు అదే గ్రామానికి చెందిన శ్రీనివాస్‌తో 2005లో వివాహమైంది. వారికి కొడుకు, కూతురు ఉన్నారు. కొంత కాలంగా శ్రీనివాస్‌తో పాటు అతని తల్లి లింగవ్వ అదనంగా కట్నం తీసుకు రావాలని భార్య లలితను వేధింపులకు గురి చేస్తున్నారు. ఈ క్రమంలో గొడవలు చోటు చేసుకున్నాయి. పెద్దలు పలుమార్లు పంచాయితీ నిర్వహించి సర్దిచెప్పినా శ్రీనివాస్‌లో మార్పు రాలేదు. లలిత పేరిట ఉన్న 1.20 ఎకరాల వ్యవసాయ భూమిని తన పేరిట చేయాలని లేని పక్షంలో రెండు లక్షల రూపాయలు అదనపు కట్నం తీసుకు రావాలని మానసిక, శారీరకంగా వేధించేవారు. ఈ నెల 9న భార్య లలితను శ్రీనివాస్ చితకబాదాడు. తనకు న్యాయం చేయాలని కోరుతూ బాధితురాలు లలిత మంగళవారం ఫిర్యాదు చేయడంతో భర్త శ్రీనివాస్, అత్త లింగవ్వలపై అదనపు కట్నం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

కొనుగోళ్లకు సర్వం సిద్ధం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడానికి పౌరసరఫరాల శాఖ సర్వం సిద్ధం చేసింది. రైతులకు అందుబాటులో ఉండే విధంగా అన్నీ గ్రామాల్లోనూ కేంద్రాలను సిద్ధం చేశారు. జిల్లాలో 255 గ్రామపంచాయతీలు ఉండగా 258 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ఐకేపీ ద్వారా 44 కేంద్రాలు, సింగిల్ విండోల ద్వారా 202 కేంద్రాలు, డీసీఎంఎస్ ద్వారా ఎనిమిది కేంద్రాలు, మెప్మా ద్వారా నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఉపయోగించడానికి 75 లక్షల గన్నీ బ్యాగులు, 258 కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్‌లు 7,777, ప్యాడీ క్లీనర్లు 634, మాయిశ్చరైజ్ మీటర్లు 603, వేయింగ్ మిషన్లు 766 సిద్ధం చేశారు.

అన్నదాతను వెంటాడుతున్న తుఫాన్ భయం..

వాతావరణంలో మార్పులు ఎలా ఉంటున్నాయో తెలియని పరిస్థితి ఉంది. ఎండ, వానా అన్నట్లుగా పరిస్థితులు ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి కోతలు కొనసాగుతుండగా తుఫాను అల్పపీడన ప్రభావం, అకాల వర్షాలు, రైతుల్లో భయాన్ని కలిగిస్తున్నాయి. అన్ని రకాల పంటలు చేతికి వచ్చే కీలకమైన సమయంలో ప్రతియేటా నష్టాన్ని కలిగిస్తున్నాయి. మూడు రోజుల క్రితం కూడా జిల్లాలో కొన్ని చోట్ల వర్షాలు పడి వరి పంటలు దెబ్బతిన్నాయి.

ఈ సీజన్‌లో ఇప్పటికే ఆగస్టు, సెప్టెంబరు మాసంలో వారం రోజులపాటు వర్షాలకు పంటనష్టాన్ని చవిచూశారు. 119 మంది రైతులు పంట నష్టపోయినట్లుగా వ్యవ సాయ అధికారులు అంచనాలు వేశారు. ప్రస్తుతం వరికోతల సమయంలో ప్రకృతి కోపాన్ని చూడాల్సి వస్తుందోనని ఆందోళనలో ఉన్నారు.

అభివృద్ధి పేరిట ఇళ్లను కూలుస్తారా?

- రోడ్ల విస్తరణ సన్నాహాలపై నిర్వాసితుల ఆగ్రహం
- ఆర్డీవోతో వాగ్వాదం

వేములవాడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి కార్యక్రమాల పేరిట రోడ్ల విస్తరణ అంటూ ఇళ్లను కూల్చివేసి విధ్వంసానికి పాల్పడతారా అని వేములవాడ పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఇళ్ల యజమానులు, వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం పట్టణ సభ నిర్వహించారు. ఈ సభకు ప్రధాన రహదారి వెంబడి ఉన్న ఇళ్ల యజమానులు వ్యాపారులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అధికారుల ఎదుట తమ నిరసన తెలిపారు.

వేములవాడ మూలవాగు బ్రిడ్జి నుంచి రాజరాజేశ్వరస్వామి దేవస్థానం వరకు ఉన్న అన్ని దుకాణాల యజ మానులు తమ దుకాణాలను మూసివేసి బైక్‌ల పై మున్సిపల్ కార్యాలయానికి ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా వారు పట్టణ సభకు అధ్యక్షత వహించిన వేములవాడ ఆర్డీవో ఎస్ రాజేశ్వర్‌తో వాగ్వాదానికి దిగారు. ప్రధాన రహదారిని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందుకు అనుగుణంగా ఇప్పటికే నోటిఫికేషన్ కూడా వెలువరించామని ఆర్డీవో తెలిపారు. రోడ్డు వెడల్పులో ఇళ్లు నష్టపోయే వారి నుంచి అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తామని, ఈ విషయంలో అందరి అభిప్రాయం వెల్లడించవచ్చని ఆయన వివరించారు. ప్రధాన రోడ్డు వెడల్పు చేయడంలో భాగంగా మొత్తం 243 దుకాణాలు, నివాసాలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు.

రోడ్డు వెడల్పు చేయడం ద్వారా పెద్దగా ప్రయోజనం ఉండదని, ఇప్పటికే ఉన్న రోడ్డుపై ఇరువైపులా భారీ ఎత్తున ఆక్రమణలు ఉన్నందున వాటిని తొలగించాలని కోరామని ఇళ్ల యజమానులు వ్యాపారులు ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. ప్రధాన రోడ్డు ఇరుగ్గా ఉన్న కారణంగానే పట్టణానికి ఇరువైపు లా రెండు బైపాస్ రోడ్లు నిర్మించారని, ఫలితంగా అన్ని రకాల వాహనాలు బైపాస్ రోడ్లమీదగా ప్రయాణం చేస్తున్నాయని, ప్రస్తుతం ప్రధాన రహదారిలో పెద్దగా ఇబ్బంది లేదని వారు ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. రోడ్ల వెడల్పు ప్రక్రియను నిలిపివేయాని తాము ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసి లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశామని వారు ఆర్డీవోకు తెలిపారు. ఇప్పటికైనా రోడ్ల వెడల్పు ప్రక్రియ ఉపసంహరించుకోవాలని కోరుతూ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, వైస్‌చైర్మన్ బింగి మహేశ్, కమిషనర్ సంపత్ రెడ్డి, తహసీల్దార్ మహేశ్‌కుమార్, కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

కల్వర్టుపై పారుతున్న నీరు

- గుంతలు పడి ప్రమాదకరంగా మారిన లో లెవెల్ కల్వర్టు


లో లెవెల్ కల్వర్టుపై పారుతున్న నీరు

కోనరావుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి లో లెవెల్ కల్వర్టుపై నిత్యం నీరు పారుతుండడంతో వరద తాకిడికి గుంతలు ఏర్పడి కల్వర్టు ప్రమాదకరంగా మారింది. సిరిసిల్ల నుంచి కోనరావుపేట మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిలో కొన్నేళ్ల క్రితం నిర్మించిన లోలెవెల్ కల్వర్టుపై మల్కపేట రిజర్వాయర్ నీరు నిత్యం పారుతోంది. అంతేకాకుండా వర్షాకాలంలో వరద ఉధృతితో లోలెవెల్ కల్వర్ట్ కొట్టుకుపోయి గుంతలుగా మారింది. రోజు నీరు పారుతుండడంతో గుంతలు కనపడక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రధాన రహదారి నీరు పారుతూ గుంతలుగా ఏర్పడి ప్రమాదాలకు దారితీస్తోంది. అధికారులు, పాలకులు స్పందించి హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రయాణికులు, మండల ప్రజలు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృత్యువాత

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపూర్ గ్రామంలోని రైతు తులసికి చెందిన పాడి గేదె మంగళవారం విద్యుదాఘాతంతో మృతి చెందిందని స్థానిక రైతులు పేర్కొన్నారు. గ్రామంలోని తులసికి చెందిన పాడి గేదె మేత కోసం గ్రామ శివారులోని బండలింగంపల్లి మానేరు వాగు ప్రాంతం వైపుకు వెళ్లిందని తెలిపారు. వ్యవసాయ పొలం వద్ద ఉన్న కరెంటు తీగ కాళ్లకు చుట్టుకోవడం వల్ల విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడిందని చెప్పారు. సుమారు రూ.70 వేలు ఉంటుందని తెలిపారు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఐకేపీ సెంటర్లకు కాంటాలు, టార్పాలిన్లు అందజేత

గంభీరావుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధర్యంలో ఐకేపీ సెంటర్లకు మంళవారం మార్కెట్ కమిటీ చైర్మెన్ కొమిరిశెట్టి విజయతిరుపతి చేతుల మీదుగా కాంటాలు, టార్పాలిన్లు అందజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మెన్ విజయతిరుపతి మాట్లాడుతూ అన్ని గ్రామాలకు గాను కవర్స్ 520, ఎలక్ట్రానిక్ కాంటాలు 80, మ్యాచ్ బాక్స్‌లు 50 అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. మొదటగా మల్లారెడ్డిపేటకు నాలుగు కాంటాలు, 19 కవర్లు, రెండు మ్యాచ్ బాక్స్‌లు అందజేశామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, డైరెక్టర్లు ఎడబోయిన ప్రభాకర్, రాజం, అజాన్, కోట లింగం, కృష్ణమూర్తి, విఠల్, సోషల్ మీడియా ఇన్‌చార్జి గౌరి శంకర్, నాయకులు రాజు, భాస్కర్, నాంపల్లి, బాలయ్య, గనేష్ తదితరులు ఉన్నారు.

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలు


సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు

సిరిసిల్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో న్యూస్ పేపర్, డిస్ట్రిబ్యూటర్ యూనియన్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం సిరిసిల్ల పాతబస్టాండ్‌లో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు తెలిపారు. 30 మంది పేపర్ బాయ్‌లను సన్మానించి నోట్‌బుక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ అడెపు రవీందర్, డిస్ట్రిబ్యూటర్ యూనియన్ అధ్యక్షుడు యెల్లె రాజేంద్ర ప్రసాద్, ప్రధానకార్యదర్శి పోచంపల్లి రాజు, ఉపాధ్యక్షుడు మల్లేశం, కోశాధికారి బాలకృష్ణ, బైరి దేవదాస్, వేణుగోపాల్, వెంగళ శ్రీకాంత్, యెల్లె శ్రీనివాస్, చిట్యాల శ్రీహరి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

● **వేములవాడ(ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాల, పట్టణంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విక్కుర్తి లక్ష్మీనారాయణ, మైనార్టీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీర్నపల్లి(ఆంధ్ర జ్యోతి): మండలంలోని గర్జనపల్లి ప్రభుత్వ పాఠశాలలో కలాం చిత్రపటా నికి పూలమాలలు నివాళులర్పించారు. కార్యక్ర మంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉమారాణి, ప్రేమ్‌సాగర్, బలరాం నాయక్, మంజుల, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

చందుర్తి(ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దేవరాజం, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాతా

కోనరావుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం లచ్చపేట, గోవిందరావుపేట తండాల్లో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ సాంస్కృతిక సారధి పొత్తూరి రాజు కళా బృందం కళా ప్రదర్శన ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కళా ప్రదర్శన ఇచ్చారు. అదేవిధంగా గ్రామంలో తడి పొడిచెత్తను వేరు చేసి గ్రామపంచాయతీ సిబ్బందికి అందించాలని సూచించారు. అదేవిధంగా పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై ప్రజలను చైతన్య పరిచారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులు పట్ల ప్రతి ఒక్కరు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్వచ్ఛదనం పచ్చదనంపై గ్రామ ప్రజలకు పాటల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారధి వేములవాడ టీం లీడర్ పొత్తూరి రాజు, కళాకారులు గడ్డం దేవయ్య, పూదూరు సంజీవ్, అంతర్పుల యూసీ్, లావణ్య, కిన్నర, శ్రీలత, అనుముల శిరీష, గ్రామ ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌కు సన్మానం

ముస్తాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తలారి రాణినర్సింహులును పోత్గల్ మాజీ సర్పంచ్ తన్నీరు గౌతంరావు మంగళవారం శాలువాతో సత్కరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తలారి రాణినర్సింహులును మార్కెట్ కమిటీ కార్యాలయంలో శాలువాతో సత్కరించి అభినందిచిన వారిలో పర్శరాములు, విశ్వనాథం ఉన్నారు.

ఆర్థిక సహాయం

బోయినపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్‌లో ఓ వలస జీవి మృతి చెందగా కుటుంబానికి జీడబ్ల్యూఏసీ ఆధ్వర్యంలో రూ 80 వేల ఆర్థిక సహాయాన్ని మంగళవారం అందజేశారు. బోయినపల్లికి చెందిన దాసరి బాబు కొద్దిరోజుల క్రితం గల్ఫ్ దేశంలో అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి గల్ఫ్ కార్మిక సంఘం జీడబ్ల్యూఏసీ ఆధ్వర్యంలో 80 వేల రూపాయలను పోగుచేసి అందజేశారు. కటుకం రవి, మోతె రాములు, గొల్లపెల్లి సత్యం, బిజిలి దేవయ్య, మహేందర్, యదా సుధాకర్, పుల్ల సాగర్, ముక్కెర వినోద్, గంగిపెల్లి రాజశేఖర్, చిట్ల మధు, రవి, సాయి, బాబు పాల్గొన్నారు.